క్లుప్తంగా

చింతరేవులలో జడ్జి పూజలు



ధరూరు: మండల పరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో గద్వాల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పూజిత మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆలయ లాంఛనాలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు అందజేయాలి

మానవపాడు: మండల పరిధిలోని అర్హులు రాజీవ్ యువ వికాసం పథకానికి మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అనంతరం దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యత చాటుదాం

రాజోళి: నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన యోధుడు, తెలంగాణ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమం జయప్రదం చేయాలని వడ్డేపల్లి మండలం గౌడ సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధయ్యగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్‌లో జరుగనున్న వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి గ్రామం నుంచి గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు హాజరు కావాలన్నారు. పాపన్నగౌడ్ పోరాట పటిమను సమాజానికి తెలిపి బీసీల ఐక్యతను సాధించాలని పిలుపునిచ్చారు.

మిషన్ భగీరథ నీటి వృథా



గట్టు: మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిన ఘటన మంగళవారం పట్టణంలోని పాత ఆలూరు రోడ్డులో జరిగింది. భారత్‌మాల రోడ్డు నిర్మాణం కోసం మట్టి తవ్వే క్రమంలో మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ పగిలింది. దీంతో నీరంతా వృథాగా రోడ్డుపై పారింది. దీంతో మండలంలోని పలు గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

చిన్నచింతకుంట: రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షులు అమరచింత విజయ్ అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాలలో విద్యార్థులు జైబీమ్ జ్ఞాన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై గ్రామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రాజ్యాంగంతో పాటు మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం, మహాత్మాజ్యోతిరావు, సావిత్రిబాయి పూలే, పెరియార్, నారాయణగురు, సాహు మహరాజు, కాన్సీరాంల వంటి చరిత్రలు తెలిసి ఉండాలన్నారు. అందుకు విద్యార్థులు ఈనెల 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 14 రోజుల పాటు కాళ్లకు చెప్పులు, మాంసం, మద్యం వంటివి వీడి దీక్షను చేపట్టి రాజ్యాంగంతో పాటు మహనీయుల జీవిత చరిత్రలను పఠిస్తారన్నారు. కార్యక్రమంలో కిన్నెర, మహేందర్, ఉంద్యాల రెమో, కోట్ల శేఖర్, వి.ప్రవీణ్, ఎం.కృష్ణయ్య, భాను ప్రకాష్, విద్యార్థులు శ్రీకాంత్, జశ్వంత్, వంశీ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అరకొర సిబ్బంది.. అందని 'ఉపాధి'

- 16 గ్రామపంచాయతీలకు ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు
- కుంటుపడుతున్న ఉపాధి హామీ పనులు
- మేట్లతోనే నెట్టుకొస్తున్న వైనం



చిన్న ఆముదాలపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఉండవెల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు, వలసలు తగ్గిస్తూ కూలీలకు ఆర్థికంగా చేయూతనందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నాయి. కానీ మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరతతో పథక లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది.

ఆరుగురే ఫీల్డ్ అసిస్టెంట్లు..

మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 6 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా కూలీలకు పనులు కల్పించడం, మస్టర్ల కేటాయింపు, పనుల పర్యవేక్షణ, జాబ్‌కార్డుల మంజూరు, ఆధార్ అనుసంధానం, కూలీలకు వసతులు కల్పించడం వంటి పనులు నిర్వహిస్తారు. మండలంలో కేవలం 6 మంది ఫీల్డ్ అసిస్టెంట్లే ఉండడంతో తక్కశీల, బైరాపురం,



బైరాపురంలో పక్కకు పెట్టిన పనుల ఫలకాలు

పుల్లూరు, ఇటిక్యాలపాడు, మారమునగాల, ప్రాగటూరు, శేరుపల్లే, ఏ.బూడిదపాడు గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. అంతే కాకుండా టెక్నికల్ అసిస్టెంట్ల కొరత కూడా ఉండడంతో ఉపాధి హామీ పనులు గ్రామాల్లో నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని గ్రామాలకు మేట్లను మాత్రమే కేటాయించడంతో సీనియర్ మేట్లు కూడా ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు.

మేట్లదే పెత్తనం..

పలు గ్రామాల్లో చోట్ల మేట్లదే పెత్తనం కావడంతో టీఏల చేతులు తడుపుతున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో మేట్లు కూడా చురుకుగా లేకపోవడంతో గ్రామ కార్యదర్శులు ఉపాధి హామీ పనుల బాధ్యత చూస్తున్నారు. అంతే కాకుండా గ్రామసభలు, నర్సరీల, నిర్వహణ, కూలీలకు వేతనాలు మంజూరు వంటి విషయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. సరైన సమయంలో డబ్బులు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు ఉన్న వారికి, ఫీల్డ్ అసిస్టెంట్లను బెదిరించే వారికి మాత్రమే వర్తింప చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లను భర్తీ చేయాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.



తక్కశీలలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ(ఫైల్)

ఉన్నతాధికారులకు తెలియజేశాం



ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉంటేనే ఉపాధి హామీ పనులు సజావుగా నడుస్తాయి. కొన్ని గ్రామాల్లో వారు లేక మేట్లను ఏర్పాటు చేశాం. త్వరలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. అసలైన అర్హులకే పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటాం.

\- తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

గట్టు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మాజీ సర్పంచ్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో తిక్కతాత జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయడం చేసుకొని కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. గెలుపు కోసం చివరి దాకా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు వెంకటన్నగౌడ్, బొజ్జన్ననాయుడు, నాయకులు వీరేష్, యల్లప్ప, దేవన్న, ప్రభు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గట్టు: మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో నిర్వహిస్తున్న తిక్కతాత జాతర సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు మంగళవారం మాజీ జెడ్పీటీసీ సభ్యులు బాసు శ్యామల బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేల నగదు అందజేశారు. టోర్నీలో మొత్తం 23 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పాస్టర్ మృతిపై నిష్పక్షపాత విచారణ చేయాలి



నిరసనలో క్రైస్తవ సంఘాల నాయకులు

గద్వాలటౌన్ : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిష్పక్షపాత విచారణ చేయాలని, క్రైస్తవ మైనార్టీల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని క్రైస్తవ మత పెద్దలు, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా మంగళవారం గద్వాలలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని క్రైస్తవ సంఘాలు, మత పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేశారు. స్థానిక రెండో రైల్వేగేటు నుంచి శాంతి ర్యాలీ చేపట్టారు. పట్టణ ప్రధాన రహదారుల వెంట ర్యాలీ సాగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవ మతపెద్దలు, సంఘాల నాయకులు మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనుమానులున్నాయని, క్రైస్తవుల పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. దేశంలో క్రైస్తవంపై దాడులు అధికమయ్యాయని, ఐక్యంగా ఉండి వాటిని ప్రతిఘటించాలన్నారు. సువార్తపై జరుగుతున్న మతోన్మాద దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. శాంతి ర్యాలీకి పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులు సంఘీ భావం తెలిపారు. నిరసన అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు చర్చిలకు చెందిన పాస్టర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

జేఏసీ నాయకుడికి సన్మానం

ఎర్రవల్లి: పొలిటికల్ జేఏసీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన బీచుపల్లికి చెందిన నాగరాజును మంగళవారం సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సాహంగా ఎద్దుల బండ్ల గిరక పోటీలు



పోటీలో పాల్గొన్న వృషభాలు

మల్దకల్: మండల కేంద్రంలో ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం ఎడ్ల బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన పోటీలను తిలకించేందుకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 14 జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 5016, ద్వితీయ బహుమతి రూ.3016, తృతీయ బహుమతి రూ. 2016లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్ధు నర్సింహులు, మల్దకల్, ఆంజనేయులు, నర్సింహులు, తిమ్మప్ప, గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వనపర్తి విద్యావిభాగం: ఆదిత్య పరాశ్రీస్వామి ఆధ్వర్యంలో ఈనెల 4న అంబాత్రేయ నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వారం గ్రామ శివారులో గల అంబాత్రయ క్షేత్రంలో నిర్వహించనున్న గోమాత కల్యాణం వాల్‌పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద చౌరస్తాలో హిందూవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహించే గోమాత కల్యాణాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి వీక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త పోచ రవీందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వేణు, కిషోర్, కంది వెంకటరమణ, పిరమిడ్ ధ్యాన నిర్వాహకులు ఉమేష్ తదితరులు ఉన్నారు.

హెచ్‌సీయూ భూముల అప్పగింతపై నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

గద్వాలటౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం స్థానిక ప్రభుత్వ పీజీ సెంటర్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సీఎంకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పాలకులు ఏడాదిన్నర కాలంగా విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. భూములను బలవంతంగా తీసుకోవడమంటే పేద విద్యార్థుల చదువులను ధ్వంసం చేయడమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల అమ్మకాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో నిరసన తెలిపిన విద్యార్థిలపై పోలీసుల జరిపిన లాఠీచార్జిని ఖండించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రాజశేఖర్, మాధవ్, మహేష్, ప్రకాష్, పవన్, రాజు, బలిచక్రవర్తి, ధనరాజ్, అభి, నరేంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుల రాక

పాన్‌గల్: మండల కేంద్రానికి బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, కోళ్ల వెంకటేష్‌తో పాటు సంఘం రాష్ట్ర నాయకులు కూడా హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రామకృష్ణ, స్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు గ్రామాల్లో ఎస్సీలపై జరుగుతున్న దాడులపై స్థానిక పోలీసులతో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చర్చిస్తారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

ఖిల్లాఘనపురం: వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పుడే వడదెబ్బ బారిన పడకుండ ఉంటామని కళాజాత బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ఉప్పరిపల్లిలో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం వారు ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కళాబృందం టీం లీడర్ డప్పు నర్సింహతో పాటుగా సభ్యులు శివలింగం, సువర్ణ, రాధ, కృష్ణయ్య, రాజు, శ్రీనివాసులు పాటలు, నృత్యాల ద్వారా ప్రజలకు అర్థం అయ్యే విధంగా చెప్పారు. ముఖ్యంగా ప్రస్తుత ఎండాకాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎవరికైనా వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అదేవిధంగా వేసవిలో తరుచుగా వచ్చే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారం రోజుల పాటుగా మండలంలోని ప్రతి గ్రామం తిరుగుతూ కళాజాతా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

సన్నబియ్యం ఘనత కేంద్ర ప్రభుత్వానిదే



మాట్లాడుతున్న రామాంజనేయులు

అయిజ: రాష్ట్రంలోని పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా లభించే సన్నబియ్యం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ఈ పథకం ఏర్పాటు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతుల నుంచి సేకరించే బియ్యానికి, సంచులకు, రవాణా, కూలీలకు కేంద్ర ప్రభుత్వమే డబ్బు చెల్లిస్తుందన్నారు. ఈ ప్రక్రియను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న అప్పును, దానికి సంబంధించిన వడ్డీని కేంద్రమే భరిస్తుందన్నారు. పేదలకు ఇచ్చే సన్నబియ్యం అయ్యే ఖర్చు ఒక కేజీకి రూ.50 అయితే రూ.10 రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే రూ. 40 కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని దాచిపెట్టి రాష్ట్ర ప్రభుత్వమే సన్నబియ్యాన్ని ఉచితంగా సరఫరా చేస్తుందని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రేషన్ కార్డులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోటోను పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, శివారెడ్డి, గోపాల కృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, నరసింహులు, రాజశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే చర్యలు



ఇర్కిచేడులో నాయకులతో ఎస్ఐ శ్రీనివాసులు

కేటీదొడ్డి: సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ టంగుటూరి శ్రీను అన్నారు. మంగళవారం మండలంలోని ఇర్కిచేడులో గత 3 సంవత్సరాల క్రితం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో జరిగిన వివాదాల పాత వీడియోలు పోస్ట్ చేసి తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ శ్రీనివాసులు గ్రామాన్ని సందర్శించి సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమన్నారు. అట్టి వారిపై జిల్లా సోషల్ మీడియా సెల్ నిఘా ఉంచినట్లు తెలిపారు. తప్పుడు కథనాలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలు కొనసాగించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అయిజ: మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలు కొనసాగించాలని బీఎస్పీ అలంపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు శశివర్మ తేజ అన్నారు. ఈనెల 11న మండల కేంద్రంలో పూలే జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించాలన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పల క్యాంప్ గ్రామంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే కుల నిర్మూలన జరుగుతుందని భావించిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో మనోహర్, తాయన్న, జాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ పోరాటంతోనే సాధ్యం



మందకృష్ణ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఉండవెల్లి: దళితుల వర్గీకరణ బిల్లును రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పోరాటంతోనే సాధ్యమైందని మండలంలోని ప్రాగటూరులో స్థానిక నాయకులు అన్నారు. మంగళవారం మందకృష్ణ మాదిగ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, సవారయ్య, వెంకటేశ్వర్లు, స్వాములు, భరత్, శేషన్న, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరయ్య ఉర్సు



కిస్తీ కుండలను తీసుకొస్తున్న గ్రామస్తులు



కిస్తీకి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో దస్తగిరయ్య ఉర్సు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉత్సవాల్లో భాగంగా కిస్తీ పోటీలు నిర్వహించారు. గ్రామస్తులు ఇళ్ల నుంచి నైవేద్యాలను బ్యాండ్ మేళాలతో తీసుకొచ్చి దర్గా వద్ద కలిపారు. గ్రామ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



బి.వీరాపురంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బి. వీరాపురం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నాయకులతో కలిసి సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, తిమ్మారెడ్డి, ఉసేన్, అంజి, వెంకటన్న, బీసన్న, రవీంద్రబాబు, రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు నాయకులు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, డీలర్ యుగంధర్‌రెడ్డి, సంపత్, శేఖర్ పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేసినట్లు యూత్ కాంగ్రెస్ నాయకుడు అధ్యక్షుడు కాశపోగు శేఖర్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుర్వ శ్రీను, మల్లేష్, వెంకటరాముడు, నాగన్న నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వండి



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి కావాల్సిన ఇసుకకు సంబంధించి అనుమతులు ఇప్పించాలని నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కోరారు. మంగళవారం మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను దమగ్నాపూర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇసుక కొరత కారణంగా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆలయ నిర్మాణ పనులు నిలిచిపోయాయని, ఇసుక అనుమతులకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే జీఎమ్మార్ సానుకూలంగా స్పందించి అనుమతులు ఇప్పించేందుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాస్, గణేష్, ఆలయ కమిటీ నిర్వాహకులు రమాకాంత్, రవీందర్, బాలకృష్ణ, వెంకట్రాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.